త్రుటిలో తప్పిన ప్రమాదం

విశాలాంధ్ర - చోడవరం: అనకాపల్లి జిల్లా చోడవరం తహశీల్దారు కార్యాలయానికి మంగళవారం పెను ప్రమాదం తప్పింది. కార్యాలయం ముఖ ద్వారం (మెయిన్ గేటు) వద్ద కొబ్బరి చెట్టు విరిగి తహశీల్దార్ కార్యాలయం నేమ్ బోర్డు ప్రమాదవశాత్తు హఠాత్తుగా పడిపోవడంతో అక్కడ ఉన్న స్థానికులు పరుగులు తీశారు. నిత్యం వందలాదిమంది ప్రజలు వివిధ పనుల కోసం తహశీల్దార్ కార్యాలయంతో పాటు ఉప ఖజానా, సబ్ జైలు కార్యాలయాలకు వస్తూ ఉంటారు. చెట్టు విరిగి పడినప్పుడు చుట్టుపక్కల ప్రజలు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పినట్లు అయింది. దీంతో తహశీల్దారు కార్యాలయం ఆవరణలో గల పలు ప్రభుత్వ కార్యాలయాలకు మంగళవారం రాకపోకలు నిలిచిపోయాయి.

యువత క్రీడల్లో రాణించాలి: హోంమంత్రి అనిత

- రూ.1.6 కోట్ల వ్యయంతో హాకీ మైదానం ప్రారంభం

విశాలాంధ్ర - నక్కపల్లి: నేటి యువత క్రీడల్లో రాణించాలని, విద్యార్థులు మానసికంగా, శారీరకంగా దృడంగా ఉండాలని రాష్ట్రం హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత అన్నారు. ఈ మేరకు మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గ్రౌండ్‌లో రూ 1.6 కోట్ల వ్యయంతో నిర్మించిన ఆస్ట్రోటర్ఫ్‌తో మినీ హాకీ గ్రౌండ్‌ను ఆమె ప్రారంభించారు. ముందుగా హాకీ లెజెండ్ ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళలర్పించారు. అనంతరం మైదానంలో క్రీడాకారులతో కలిసి ఆమె హాకీ ఆడారు. ఈ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర హోంమంత్రి అనిత మాట్లాడుతూ నక్కపల్లి ప్రాంతంలో ఇటువంటి హాకీ గ్రౌండ్ ఏర్పాటు చేయడంతో రానున్న రోజులల్లో నక్కపల్లి హాకీ నక్కపల్లిగా మారే అవకాశం ఉందన్నారు. హాకీ గ్రౌండ్‌లో వాటర్, కరెంటు సమస్యలను తక్షణమే పరిష్కరించినట్లు తెలిపారు. మట్టిలో మాణిక్యాలను వెలికితీసిన హాకీ కోచ్‌లకు ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలిపారు. పోలీస్ డిపార్టుమెంట్‌లో పనిచేస్తు, క్రీడాకారులను తయారు చేస్తున్న డిఎస్ హాకీ క్లబ్ ఫౌండర్ బలిరెడ్డి సూరిబాబు ప్రత్యేకంగా అభినందించారు. నేటి యువత క్రీడల్లో రాణించాలని, విద్యార్థులు మానసికంగా శారీకరంగా ఎంతో దృడంగా ఉండాలన్నారు. సమస్య వస్తే దైర్యకంగా ఎదుర్కో గలిగే శక్తి పిల్లలకు ఉండాలని, తల్లిదండ్రులు ఆవిధంగా పిల్లలను పెంచాలన్నారు. పాయక రావుపేటలో స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఏర్పాటు చేస్తామని, స్టేడియం కూడా ఏర్పాటు చేసే విధంగా ఆలోచన చేస్తున్నామని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం కళ్యాణ్ చొరవతో పాయకరావుపేట నియోజకవర్గంలో స్టీల్ ప్లాంట్ రాబోతుందన్నారు.

అనంతరం హాకీకోచ్‌లను ఘనంగా ఆమె సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్టోర్స్ ఆథారిటీ అధికారి వెంకటరమణ, డిఇవో అప్పలనాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేష్, రాష్ట్ర సివిల్ స్లయి కార్పోరేషన్ డైరక్టర్ బోడపాటి శివదత్, మాజీ గ్రంధాలయ చైర్మన్ తోట నగేష్, జనసేన నాయకులు గెడ్డం బుజ్జి, నక్కపల్లి గ్రామ సర్పంచ్ నేతల జయరత్నకుమారి, వైఎస్ ఎంపిపి వీసం నానాజీ, వెలగా ఈశ్వరరావు, హెచ్ఎం రాణి లలిత, డియస్ హాకీ క్లబ్ కార్యదర్శి కొల్నాటి తాతాజీ, నానాజీ, కోచ్ రాంబాబు, రామచంద్రరావు, అల్లాడ కొండబాబు, తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీల రుణాలకు దరఖాస్తులు

విశాలాంధ్ర - చీడికాడ: మైనార్టీలు బ్యాంకు రుణాల కోసం దరఖాస్తులు చేసుకోవాలని మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యులు షేక్ సూర్యనారాయణ కోరారు. ఆయన మంగళవారం మండలం లోని ఖండివరంలో మాట్లాడుతూ ప్రభుత్వం మైనార్టీలకు బ్యాంకులో రుణాలు ఇస్తామని ఆదేశాలు ఇచ్చిందన్నారు. మైనార్టీలు ఆధార్ కార్డు, బ్యాంక్ ఎకౌంటు తీసుకొని సంబంధిత సచివాలయం మీసేవ కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

రీ సర్వే పరిశీలించిన తహశీల్దార్

విశాలాంధ్ర - యస్.రాయవరం: మండలంలో వమ్మవరం గ్రామంలో భూ రీ సర్వే పనులను తహశీల్దార్ జె.రమేష్ బాబు పరిశీలించారు. మంగళవారం గ్రామంలో రీ సర్వే పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. రైతులకు ఇబ్బందులు లేకుండా సిబ్బంది రీ సర్వే చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

బ్రిడ్జి నిర్మాణ పనుల పరిశీలన

విశాలాంధ్ర - మునగపాక: అనకాపల్లి-అచ్చుతాపురం మెయిన్ రోడ్డులో ఆవ కాలువపై గల బ్రిడ్జి పూర్తిగా శిథిలావస్థకు చేరుకొని ప్రమాదకర స్థితికి చేరింది. దీంతో మునగపాక కృష్ణంరాజు కాలువ వద్ద నూతన బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు చేపట్టారు. దీంతో బ్రిడ్జి నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ కలిసి మంగళవారం బ్రిడ్జ్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంక్రీట్ వాల్ పనులు పటిష్టంగా ఉండాలన్నారు. అలాగే రానున్న వర్షాకాలంను దృష్టిలో ఉంచుకొని వంతెన నిర్మాణంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని, వంతెన పనులు వేగవంతంగా పూర్తిచేయాలని, క్వాలిటీ విషయంలో ఎక్కడా రాజీ పడకుండా నిర్మించాలని కాంట్రాక్టర్, సంబంధిత అధికారులకు వారు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు దొడ్డి శ్రీనివాసరావు, జనసేన పార్టీల మండల అధ్యక్షులు టెక్కలి పరశురామ్, వివిధ శాఖల అధికారులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు చేరాలి: ఎమ్మెల్యే బండారు

విశాలాంధ్ర - కే.కోటపాడు: ప్రభుత్వ పాఠశాలల్లో అధిక శాతం విద్యార్థులు చేరేలా ఉపాధ్యాయులు, అధికారులు, విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కలిగించాలని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. మంగళవారం మండలం గొల్లలపాలెం గ్రామంలో కస్తూరిబా బాలికల విద్యాలయంలో కోటి 64 లక్షల సర్వ శిక్ష అభియాన్ నిధులతో అదనపు తరగతుల భవనానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పనకు అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నూతన విద్యా విధానం ద్వారా విద్యార్థుల మేధస్సుకు పదును పెట్టే విధంగా అనేక చర్యలు తీసుకుంటున్నారని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయులు ఉంటారని ఈ సంవత్సరం 10వ తరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల సత్తా చూపించారని అన్నారు. కస్తూరిబా పాఠశాలలో తరగతి గదుల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని సర్వ శిక్ష అభియాన్ అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు రొంగలి మహేష్, దాడి ఎరుకనాయుడు, బొడ్డు అక్కు నాయుడు, కన్నూరు సూర్య నారాయణ, జోగ దేవుడు, ఎంఈఓ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలి
ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్

విశాలాంధ్ర - అచ్యుతాపురం: మహిళలు ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన అచ్యుతాపురం పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న డిజిటల్ లైబ్రరీలో బీసీ కార్పొరేషన్, వెనుకబడిన తరగతుల సహకార ఆర్థిక సంస్థ సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయుడు మహిళల సంక్షేమానికి కృషి చేస్తున్నారన్నారు. కుట్టు మిషన్ కేంద్రాలలో 90 రోజులు పాటు శిక్షణ ఇచ్చి, కుట్టుమిషన్ ఉచితంగా అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ చైర్ పర్సన్ లాలం భవాని భాస్కర్, కూటమి నాయకులు జనపరెడ్డి శ్రీనివాసరావు, బైలపూడి శ్రీరామదాసు, ద్వారపురెడ్డి బాబ్జి, కూండ్రపు విమలానాయుడు, కూండ్రపు నాయుడుబాబు, మేరుగు ప్రవీణ్ కుమార్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

భూ కబ్జాదారుల నుండి కాపాడండి

విశాలాంధ్ర - కె.కోటపాడు: ఇటీవల కాలంగా గ్రామాల్లో సైతం భూకబ్జాలు పెరుగుతున్నాయి. సాగుదారుల అధీనంలోనే భూములు ఉన్నా రెవిన్యూ రికార్డుల్లో పేర్లు తారుమారవుతున్నాయి. వీటిని ఆసరాగా చేసుకుని అక్రమార్కులు బ్యాంకుల్లో భారీగా రుణాలు పొందుతున్నారు. మండల కేంద్రం కే కోటపాడులో రొంగలి, పైలా కుటుంబాలకు తాత ముత్తాతల నుండి ఉమ్మడిగా 69 సెంట్లు భూమి ఉంది. ఈ భూమిని మండల బిజెపి అధ్యక్షురాలు పైలా అమ్మాజీ తన భర్త ఈశ్వరరావు పేరున ఆన్లైన్ లో నమోదు చేయించుకుని స్థానిక కోపరేటివ్ బ్యాంకులో రుణం పొందినట్లు పైడమ్మ చెరువు ఆయకట్టుదారుల సంఘం అధ్యక్షుడు పైలా గంగు నాయుడు, రొంగలి చిరంజీవి రొంగలి అబద్ధం, పైలా గోపి తదితరులు ఆరోపించారు. ఈ విషయమై పైల అమ్మాజీని రెండు కుటుంబాల పెద్దలు అడుగగా తనపై దాడులకు దిగుతున్నారని పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసిందని అన్నారు. తనకు రాజకీయ నాయకుల అండ ఉందని మీరు నన్ను ఏమి చేయలేరని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పిందన్నారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్కు స్పందనలో మూకుమ్మడిగా తరలివెళ్లి ఫిర్యాదు చేసామన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం తాసిల్దార్ రమేష్ బాబుకు జరిగిన సంఘటనలను వివరించారు. ఇది మా అందరి ఉమ్మడి ఆస్తి అయినందున మోసపూరిత రికార్డులు సృష్టించి మమ్మల్ని మోసం చేసిందని ఆరోపించారు. అధికారులు పబ్లిక్ విచారణ జరిపించి తమకు న్యాయం చేయాలని వారందరూ ముక్తకంఠంతో కోరుతున్నారు.

కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ నిరసన దీక్షకు మద్దతు
బీఎస్పీ ఇన్‌చార్జి సూదికొండ మాణిక్యాలరావు

విశాలాంధ్ర - అనకాపల్లి: తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం గత ఎనిమిది రోజులుగా స్థానిక ఎస్బిఐ బ్రాంచ్ వద్ద శాంతియుత నిరసన తెలియజేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల నిరసన దీక్షా శిబిరాన్ని బహుజన్ సమాజ్ పార్టీ అనకాపల్లి ఇన్చార్జ్ సూదికొండ మాణిక్యాలరావు మంగళవారం సందర్శించి వారి నిరసనకు మద్దతు తెలిపారు. ఎంతో ఉన్నతమైన వైద్య విద్యను అభ్యసించి అరకోర జీతాలతో ఆర్థిక సమస్యలతో ఇబ్బందులను ఎదుర్కొంటూ కూడా ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం సేవలు అందిస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ పట్ల ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని ఆయన తీవ్రంగా ఖండించారు. రాష్ట్రవ్యాప్తంగా వేల సంఖ్యలో ఉన్నటువంటి కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ యొక్క న్యాయమైన డిమాండ్లను పరిష్కరించి వారికి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆయుష్మాన్ భారత్ నిబంధనల ప్రకారం వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని అజయ్ భవనాలలో నిర్వహించబడుతున్న క్లినిక్‌లలో అద్దెను పూర్తిస్థాయిలో చెల్లింపులు చేయాలని అని ఆధారిత ప్రోత్సాహకాలను క్రమబద్ధీకరించాలని ఈపీఎఫ్ఓను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

కశింకోట టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షునిగా తాకాసి

విశాలాంధ్ర - కశింకోట: మేజర్ పంచాయతీ కశింకోట టీడీపీ గ్రామ కమిటీ ఎన్నిక మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమానికి మండల పార్టీ అధ్యక్షుడు మురళి, తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి గొంతుని శ్రీనివాసరావు పాల్గొని కమిటీని నియమించారు. అధ్యక్షునిగా తాకాసి కృష్ణ, ప్రధాన కార్యదర్శిగా వేగి సాయి, ఉపాధ్యక్షుడు బత్తిని వీరభద్రరావు, కార్యదర్శులుగా వేయి సన్యాసిరావు, పెంటకోట జగన్నాధరావు, ట్రెజరర్ కందాల సూర్య జగన్నాథ రావు, తెలుగు యువత అధ్యక్షునిగా కోయిలాడ నాగు, మహిళా అధ్యక్షురాలుగా కొంతం ఈశ్వరమ్మలను ఎన్నుకున్నారు. కాగా నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు కృష్ణ మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి మరింత కృషి చేస్తానని, సమిష్టి కృషితో కార్యకర్తలు అందరికీ అందుబాటులో ఉంటానని తెలిపారు. అనంతరం నూతన కమిటీని సాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఉగ్గిన రమణమూర్తి, వేగి గోపి సిదిరెడ్డి శ్రీనివాసరావు, సతీష్, వేగి దొరబాబు వేగి వెంకటరావు, చెవ్వేటి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించని సచివాలయ సిబ్బంది

విశాలాంధ్ర - మునగపాక: ప్రభుత్వ ఉద్యోగులు నిబంధనలు పాటించకుండా సమయపాలన అమలు చేయకుండా ఇష్టానుసారం వ్యవహరించడం వల్ల పనుల కోసం వచ్చే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం 10.40, 11 అయినా విధులకు హాజరు కాలేదు. మండల కేంద్రం మునగపాక సచివాలయ 1,2 సిబ్బంది ఏ రోజూ విధులకు సక్రమంగా హాజరు కావడం లేదు. వివిధ పనుల కోసం సచివాలయాలకు వచ్చే వృద్ధులు, వికలాంగులు, గ్రామస్తులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయమై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా పెడచెవిన పెడుతున్నారని ప్రజలు వాపోతున్నారు. పనుల కోసం వచ్చే ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని సచివాలయం సిబ్బంది సకాలంలోకి విధులకు హాజరయ్యేలా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

విద్యకు కూటమి అధిక ప్రాధాన్యత: హోం మంత్రి అనిత

విశాలాంధ్ర - కోటవురట్ల: ప్రభుత్వ పాఠశాలల్లో విలువలతో కూడిన విద్యను అందించడమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత అన్నారు. మంగళవారం స్థానిక కరుస్తూరిబా గాంధీ విద్యాలయంలో అదనపు భవనాల నిర్మాణానికి ఆమె భూమి పూజ చేశారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కస్తూరిబా గాంధీ విద్యాలయంలో విద్యా ప్రమాణాలు మరింత మెరు గుపరచడానికి ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతుందన్నారు. పాఠశాలలో భవనాల కొరత ఉన్నందున అదనపు భవనాల నిర్మాణానికి కోటి 68 లక్షలు మంజూరు అయ్యా అన్నారు. పనులు వేగవంతం చేసి త్వరితగతిన భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలని గుత్తేదారులకు ఆదేశించారు. అనంతరం కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులు ఉత్తమమైన ప్రతిభను కనపరచడం అభినందనీయమన్నారు.

ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్య బోధన జరగాలన్నారు. రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్ చొరవతో అదనపు భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం ఆర్డిఓ వీవి రమణ, మండల తెదేపా అధ్యక్షుడు జానకి శ్రీనివాసరావు, జిల్లా తెదేపా ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు, జనార్ధన్, తహశీల్దార్ తిరుమలబాబు, ఎంపీడీవో కాశి విశ్వనాథరావు, ఎంపీటీసీ వీవీ సూర్యరావు సర్పంచ్ అనిల్ కుమార్ జానకి హరి, తిరుమలరావు, సుంకర బాబ్జి, కస్తూరిబా గాంధీ విద్యాలయం ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, కసిరెడ్డి ఏసు, రామకృష్ణ పాల్గొన్నారు.

మెరుగైన నేర విచారణకు ఫోరెన్సిక్ ఆధారాల పాత్ర కీలకం

డీఐజీ గోపీనాథ్ జట్టి

విశాలాంధ్ర - అనకాపల్లి: నేరాల దర్యాప్తులో ఆధునిక శాస్త్రీయ విధానాల ప్రాముఖ్యతను దృష్టిలో ఉంచుకుని పట్టణంలోని శంకరన్ హాల్లో సోమవారం జిల్లా పోలీసులు ఒకరోజు సమీక్షా సమావేశం నిర్వహించారు. విశాఖపట్నం రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి ముఖ్య అతిథిగా హాజరై నేరస్థలాల్లో ఫోరెన్సిక్ ఆధారాల సేకరణ, నిర్వహణ, 'చైన్ ఆఫ్ కస్టడీ' పాటించాల్సిన విధానాలపై అధికారులు అవగాహన కలిగి ఉండాలన్నారు. బాధితులకు న్యాయం జరగాలంటే దర్యాప్తు అధికారులు, ఫోరెన్సిక్ వైద్యులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు పరస్పర సహకారంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ఫోరెన్సిక్ ఎవిడెన్స్ మేనేజ్మెంట్ శిక్షణ ద్వారా నిందితులకు తగిన శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఎస్పీ తుహిన్ సిన్హా మాట్లాడుతూ శిక్షణా కార్యక్రమం దర్యాప్తు నాణ్యతను పెంచడంలో దోహద పడుతుందన్నారు. ఫోరెన్సిక్ నిపుణుల సూచనలు, మార్గదర్శకాలు అధికారులకు ఉపయుక్తంగా ఉంటాయని అన్నారు. వర్క్‌షాప్‌లో నార్కోటిక్స్, మత్తు పదార్థాలు, విషపదార్థాలు (టాక్సి కాలజీ), డిజిటల్ ఆధారాలు, సైబర్ నేరాల పరికరాలు, ఆడియో-వీడియో ఫుటేజ్, డీఎన్ఏ, రక్త నమూనాలు, మానవ అవయవాలు వంటి ఆధారాల సేకరణ, ప్యాకింగ్, భద్రపరచే విధానంపై శిక్షణ ఇచ్చారు. సంబంధిత ఆధారాలతో పాటు పంపించాల్సిన డాక్యుమెంటేషన్ గురించి కూడా సూచనలు అందించారు. ఈ శిక్షణను ఆర్.ఎఫ్.ఎస్.ఎల్ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ వి.నాగరాజు, శాస్త్రీయ సహాయకులు ఎం.రాంబాబు, పి.వి.ఎస్.బి.చలపతి, ఇ.కిరణ్ కుమార్‌లు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఎం.దేవప్రసాద్, ఎల్.మోహనరావు, డీఎస్పీలు ఎం.శ్రావణి, పి.శ్రీనివాసరావు, వి.విష్ణు స్వరూప్, ఫోరెన్సిక్ వైద్యులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, పోలీస్ ఇన్స్పెక్టర్‌లు లక్ష్మణ్ మూర్తి, బాల సూర్యారావు, లక్ష్మి, విజయ, ఎస్సైలు ప్రసాద్, రమణయ్య, సురేష్ బాబు, జిల్లా సీఐలు, ఎస్సైలు, స్టేషన్ రైటర్లు పాల్గొన్నారు.

జిల్లా కేంద్ర సహకార బ్యాంకులలో, ఆప్కాబ్‌లో అవినీతిపై కమిటీ శుభ పరిణామం

జిల్లా కేంద్ర సహకార బ్యాంకు పూర్వపు చైర్మన్ విల్లూరి పైడారావు

విశాలాంధ్ర - అనకాపల్లి: రాష్ట్రంలో గత ప్రభుత్వంలో జిల్లా కేంద్ర సహకార బ్యాంకులలో, ఆప్కాబ్లో జరిగిన అవినీతిపై అనకాపల్లి శాసనసభ్యులు మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ చైర్మన్ హౌస్ కమిటీ వేయడం చాలా శుభ పరిణామమని విశాఖ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు పూర్వపు మేనేజర్ విల్లూరి పైడారావు ఆనందం వ్యక్తపరిచారు. రాష్ట్రంలో జిల్లా కేంద్ర సహకార బ్యాంకుల్లోనూ ఆప్కాబ్‌లోను జరిగిన అవినీతిపై గత శాసనసభలో శాసన సభ్యులు గళం ఎత్తిన విషయం అందరికీ తెలిసిందేనని ఆనాటి సభలో రాష్ట్ర వ్యాప్తంగా 5000 కోట్ల వరకు అవినీతి జరిగిందని సభలో మాట్లాడడం జరిగిందన్నారు. దానిపై స్పీకర్ అయ్యన్నపాత్రుడు స్పందించి హౌస్ కమిటీ వేయడం ఆనందకరమని అన్నారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంకులో అవినీతి జరిగిందని 51 ఎంక్వయిరీలో తేటతెల్లమైన గత ప్రభుత్వం దానిని తుంగలో తొక్కి ప్రభుత్వం నుండి స్టే తెచ్చుకుని ఇప్పటికీ అప్పటి సీఈవో డివిఎస్ వర్మ కొనసాగుతున్నారని ఆరోపించారు. గత ప్రభుత్వంలో సుమారుగా 300 కోట్ల వరకు జిల్లాలో అవినీతి జరిగిందని స్వయంగా ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేయటం జరిగిందని అన్నారు. దీనిపై ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ ఫిర్యాదు చేసిన వివిధ పత్రికల్లో జిల్లాలో జరిగిన అవినీతిపై వార్తలు వచ్చిన కలెక్టర్ ఎటువంటి చర్యలు తీసుకోక పోవడం విచారకరమని అన్నారు. ఇప్పటికైనా విశాఖ జిల్లా కేంద్ర సహకార బ్యాంకులో జరిగిన అవినీతిపై ఫిర్యాదులను స్వీకరించి రైతుల డబ్బులను కాపాడాలని హౌస్ కమిటీ చైర్మన్ కొణతాలరామకృష్ణని, కమిటీ సభ్యులను కోరుతున్నానని విల్లూరిపై డారావు తెలిపారు.

పైడిమాంబ అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే సుందరపు

విశాలాంధ్ర -మునగపాక: మండలంలో ఓంపోలు గ్రామంలో శ్రీ పైడిమాంబ అమ్మవారి పండగ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ పైడిమాంబ అమ్మవారిని యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ఆహ్వానించి అర్చకులచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు దొడ్డి శ్రీనివాసరావు, మాజీ వైస్ ఎంపీపీ ఉల్లింగల గోవింద్, ఉల్లింగల సంతోష్, జనసేన నాయకులు వరసత్య, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఫ్లైఓవర్ పనుల పరిశీలన

విశాలాంధ్ర - అచ్యుతాపురం: జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్, ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ మండల కేంద్రమైన అచ్యుతాపురంలో జరుగుతున్న ఫ్లై ఓవర్, రోడ్డు విస్తరణ పనులను మంగళవారం పరిశీలించారు. అంతకుముందు హరిపాలెంలో గల వంతెన పనులను పరిశీలించారు. రానున్న వర్షాకాలం దృష్ట్యా జాగ్రత్తలు తీసుకోవాలని, పనులు నాణ్యతతో వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

పంటలకు నష్టపరిహారం చెల్లించాలి

విశాలాంధ్ర - సబ్బవరం: మండలంలోని ఇటీవల కురిసిన అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం చెల్లించాలని మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని స్థానిక వైసీపీ కార్యాలయంలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు రైతన్నలకు అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులకు ఏటా ఇరవై వేల రూపాయలు అందజేస్తామని హామీ ఇచ్చి దాన్ని పక్కన పెట్టి ఇంతవరకు అమలు చేయలేదని ఆరోపించారు. తమ ప్రభుత్వ హయాంలో రైతు భరోసా కేంద్రాలు ద్వారా రైతులకు పంట నష్టం పరిహారం, పంటల భీమా, ఉచిత విద్యుత్తు, ధాన్యం కొనుగోలు వంటి కార్యక్రమాలను చేపట్టామన్నారు. అయితే కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని, వ్యవసాయ రంగాన్ని పక్కన పెట్టి ఎన్నికలలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను కూడా అమలు చేయలేదని ఆరోపించారు. వర్షాలకు తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నేతలు కోటాన రాము, పి.సురేష్, వద్దాది అప్పలరాజు, దనిమిరెడ్డి శ్రీను, బలిరెడ్డి కనకరాజు పాల్గొన్నారు.

సీఐని కలిసిన మండల టిడిపి పార్టీ అధ్యక్షుడు మహాలక్ష్మి నాయుడు

విశాలాంధ్ర-సబ్బవరం: మండల కేంద్రంలోని స్థానిక సబ్బవరం సీఐగా నూతనంగా ఉద్యోగ బాధ్యతలు స్వీకరించిన రామచంద్రరావు ని మంగళవారం సబ్బవరం మండలం టిడిపి పార్టీ అధ్యక్షుడు మిడతాడ మహాలక్ష్మి నాయుడు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు రోంగలి దేముడుబాబు,సబ్బవరపు సూర్యనారాయణ,తదితరులు పాల్గొన్నారు.

దేవాలయ భూముల పరిరక్షణలో
దేవాదాయ శాఖ మొద్దు నిద్ర

- కోట్లు విలువచేసే భూములు కబ్జాకు గురవుతున్నా పట్టించుకోని వైనం
- దేవాదాయ శాఖ అధికారుల తీరుపై మాల మహానాడు, దేవాలయ డెవలప్మెంట్ ట్రస్ట్ ఆగ్రహం

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: దేవాలయానికి దాతలు ఇచ్చిన భూమిని కొంతమంది వ్యక్తులు కబ్జా చేసి విక్రయాలు సాగిస్తున్న దేవాదాయ శాఖ అధికారులు చలనం లేదని మాల మహానాడు జిల్లా ప్రధాన కార్యదర్శి గోదు వెంకటేశ్వరరావు, దేవాలయ డెవలప్మెంట్ ట్రస్ట్ సభ్యులు కొత్తూరు రామ్మోహనరావు, ఈగల మహేశ్వరరావు, పొట్నూరు నాగేంద్ర, శేఖర్ మంత్రి పాండురంగ, సమాచార హక్కు పరిరక్షణ సమితి కన్వీనర్ కొమర కృష్ణ కుమార్ ఆరోపించారు. మండలంలోని రాజుపాలెం, సిరసపల్లి గ్రామంలో ఉన్న వెంకటేశ్వర స్వామి, అలివేలు మంగమ్మ దేవాలయ ప్రాంగణంలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజుపాలెం, సిరసపల్లి గ్రామంలో గల వెంకటేశ్వర స్వామి, అలివేలు మంగమ్మ దేవాలయ డెవలప్మెంట్ ట్రస్ట్‌కు శేఖర్ మంత్రి నారాయణరావు, సన్యాసమ్మ దంపతులు సర్వే నెంబరు 94, 93లో ఎకరా 09 సెంట్లు 1986లో ఇచ్చారని తెలిపారు. అప్పటినుండి ఆ భూమి దేవాలయ అధికారుల ఆధీనంలో ఉంచుకొని దాని ద్వారా వచ్చే ఆదాయంతో ఆలయంలో ధూప దీప నైవేద్యాలు సమకూర్చుకునే వారని తెలిపారు. కబ్జాలనే వృత్తిగా చేసుకుని బ్రతికే అందరూ వ్యక్తులు కన్ను ఈ దేవాలయ భూమిపై పడిందని దీంతో రెండు సంవత్సరాల క్రితం నుంచి పదమటయ్య కుమారుడు బంగార్రాజు అనే కబ్జాకోరు ఈ భూమిని ఆక్రమించి నకిలీ పత్రాలు సృష్టించి అమ్మకాలు సాగిస్తున్నాడని ఆరోపించారు. విష్ణు అనే వ్యక్తి ద్వారా తప్పుడు ధృవపత్రాలతో కొనుగోలుదారులను మోసం చేస్తూ లక్షలాది రూపాయలను దోచుకుంటున్నారని ఆరోపించారు. ఎకరా 09 సెంట్లున్న భూమి ప్రస్తుతం 73 సెంట్లు మాత్రమే ఉందని మిగతా భూమిని పట్లుగా విభజించి అమ్మేశరని ఆరోపించారు. ప్రస్తుతం ఉన్న 73 సెంట్లు కూడా అమ్మడానికి ప్రయత్నాలు చేస్తున్నాడని అన్నారు. ఇదే విషయంపై దేవాలయ ట్రస్ట్ హైకోర్టును ఆశ్రయించి రిఫ్టిఫికేషన్ వేసినట్లు తెలిపారు. ప్రస్తుతం కేసు కోర్టులో ఉందని అయినప్పటికీ కబ్జాదారుడైన బంగారు రాజు ప్రస్తుత సభ్యులను బెదిరించి భూమిని అమ్మేందుకు ప్రయత్నిస్తున్నాడని ఆరోపించారు. ఇదే విషయంపై అనేక మార్లు దేవాదాయశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ వారిలో చలనం లేదని మండిపడ్డారు. దేవాలయాల భూముల పరిరక్షణలో దేవాదాయ శాఖ అధికారుల ఉదాసీనత వైఖరి వల్లే బంగారు రాజు లాంటి కబ్జాదారులు బరితెగిస్తున్నారని అన్నారు. బంగారురాజుపై చర్యలు తీసుకొని, దేవాలయ భూములు రక్షించాలని వారు కోరారు.

కోర్టులకు స్థలం లేదు కానీ అధికార పార్టీకి మాత్రం ఉందా..?

టిడిపికి ఇచ్చిన స్థలం లీజును రద్దు చేయాలి
ఆల్ ఇండియా లాయర్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పి.ఎస్. అజయ్ కుమార్

విశాలాంధ్ర - అనకాపల్లి: గత అనేక సంవత్సరాలుగా అనకాపల్లి కేంద్రంలో ఉన్న వివిధ న్యాయస్థానాలు ఒక ప్రైవేటు అద్దె భవనంలో నడుస్తున్నాయని, అనకాపల్లి జిల్లా కేంద్రంగా మారిన తర్వాత కోర్టుల సంఖ్య పెరిగి, విద్య కళాశాల కోసం కట్టిన ఈ భవంతిని న్యాయస్థానాలకు అద్దెకు ఇచ్చారని కళాశాల తరగతి గదులలో కోర్టులను నిర్వహిస్తున్నారని, న్యాయమూర్తి ముందు న్యాయవాదులకు సహితం కూర్చోవడానికి జాగా లేక, సీనియర్ న్యాయవాదులు కూడా గంటల తరబడి నిలబడివలసి వస్తుందని, పదుల సంఖ్యలో కేసులు ఉన్నప్పుడు కారిడార్ మొత్తం కోర్టుకు వచ్చిన వారితో నిండిపోతుందని, కోర్టులో పేరు పిలిచిన తర్వాత అనేకమందిని తోసుకుంటూ వాదులు, ప్రతివాదులు, ముద్దాయిలు న్యాయమూర్తి ముందుకు వెళ్ళవలసి వస్తుందని, ఇక మహిళలైతే వారి ఇబ్బందులు చెప్ప లేరని అనేక సంవత్సరాలుగా న్యాయశాఖ, ఉమ్మడి విశాఖ జిల్లా కలెక్టర్ కు, అనకాపల్లి జిల్లా కలెక్టర్‌కు తమకు స్థలం కేటాయించాలని లేఖలు రాస్తూ ఉంటుందని, న్యాయవాదులు కూడా పలుమార్లు వినతి పత్రాలు ఇచ్చారని అయినా స్థలాలు దొరకటం లేదని జిల్లా రెవిన్యూ యంత్రాంగం చెబుతూ వచ్చిందని ఆల్ ఇండియా లాయర్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.ఎస్. అజయ్ కుమార్ తెలిపారు. కానీ అధికారి తెలుగుదేశం పార్టీ అడిగిన వెంటనే మంత్రివర్గ తీర్మానంతో సంబంధం లేకుండా అనకాపల్లిలో భాగమైపోయిన తుంపాల రెవిన్యూ సర్వే నంబర్ 608-1 లో, రెండు నుండి మూడు కోట్ల విలువైన రెండు ఎకరాల స్థలాన్ని ఒక ఏడాదికి కేవలం 1000 రూపాయలు నగదుతో 33 సంవత్సరాలకు తెలుగుదేశం పార్టీకి జిల్లా కలెక్టర్ భూమిని ఒప్పిగించారు. తాసిల్దార్ కార్యాలయం, రెవిన్యూ డివిజనల్ కార్యాలయం ఒకేరోజు దస్త్రాన్ని పూర్తి చేశారు. నాలుగు రోజుల తర్వాత జిల్లా కలెక్టర్ ఈ భూమిని తెలుగుదేశం పార్టీ వారికి అప్పగిస్తూ ఉత్తర్వులు ఇచ్చారన్నారు. కోర్టులు నిర్మించడానికి తమ వద్ద నిధులు ఉన్నప్పటికీ జిల్లా కలెక్టర్ స్థలాన్ని ఇవ్వని కారణంగా ఈరోజుకి లక్షలాది రూపాయలు అద్దె చెల్లిస్తూ న్యాయశాఖ తన కోర్టు సముదాయాలను అద్దె భవనంలో నిర్వహిస్తున్నది. కక్షిదారులు, న్యాయవాదులు, న్యాయమూర్తులు, కోర్టుకు వచ్చే మహిళా సిబ్బంది అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. వివిధ ప్రభుత్వ శాఖలు తమ భవనాలు నిర్మించడానికి స్థలాలు చూపించమని రెవిన్యూ శాఖకు అర్జీలు దాఖలు చేసి ఉన్నాయని, అవన్నీ పెండింగ్లో ఉండగా తెలుగుదేశం పార్టీ వారికి మాత్రం రెండు ఎకరాల స్థలాన్ని నామమాత్ర రుసుముతో జిల్లా కలెక్టర్ అప్పగించారన్నారు. 40 సంవత్సరాల చరిత్ర ఉన్న తెలుగుదేశం పార్టీకి నిధుల కొరత లేదు. కోట్లకు పడగలెత్తిన వర్గాలు ఆ పార్టీలో ఉండడంతో పాటు ఆ పార్టీకి మద్దతుదారులుగా కూడా ఉన్నారు. నిజానికి తెలుగుదేశం పార్టీ సొంతంగా స్థలం కొనుగోలు చేసుకుని భవనం కట్టుకోగలదని అయినప్పటికీ అధికారం చేతిలో ఉంది గనుక వివిధ ప్రభుత్వ శాఖలు, న్యాయశాఖ అర్జీలు పక్కనపెట్టి తమకు భూమిని కేటాయింప చేసుకున్నారన్నారు. అత్యంత విలువైన ఈ భూమిని కేటాయించడానికి బోర్డు స్టాండింగ్ ఆర్డర్స్ (బిఎస్ఓ) ప్రకారం మంత్రివర్గం తీర్మానం అవసరమై ఉన్నది. అయినా జిల్లా కలెక్టర్ నిబంధనలకు విరుద్ధంగా తెలుగుదేశం పార్టీ వారికి రెండు ఎకరాలు కేటాయించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. ఆ లీజు అగ్రిమెంట్ను తక్షణం రద్దు చేసి ఆ స్థలాన్ని కోర్టుల నిర్మాణానికి కేటాయించాలని డిమాండ్ చేశారు. లీజ్ అగ్రిమెంట్ను రద్దు చేసి సదరు భూమిని న్యాయస్థానాల నిర్మాణం కోసం అప్పగించాలని కోరుతూ ప్రజాస్వామ్యకువాదులు తమ నిరసన తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు. అనకాపల్లి జిల్లా తెలుగుదేశం పార్టీ నాయకులు వెంటనే స్పందించి స్వచ్ఛందంగా తమ లీజు ఎగ్రిమెంట్ను వదులుకోవాలని వారికి కోరారు. ప్రజల స్పందనను పట్టించుకోకుండా ముందుకు పోతే ఉన్నత న్యాయస్థానాల ముందు అధికారులు దోషులుగా నిలబడవలసి వస్తుందని అధికారులను అజయ్ కుమార్ హెచ్చరించారు.

40 కేజీల గంజాయి పట్టివేత

విశాలాంధ్ర - కోటవురట్ల: కారులో తరలిస్తున్న 40 కేజీల గంజాయిని పోలీసులు ఎండపల్లి వద్ద పట్టుకున్నారు. వాహనాలు తనిఖీల లో భాగంగా ఎండపల్లి వద్ద ఎస్సై రమేష్, స్థానిక పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా 40 కేజీలు గంజాయి పట్టుకున్నట్లు ఎస్సై రమేష్ తెలిపారు.ఢిల్లీకి చెందిన ముగ్గురు వ్యక్తులు చింతపల్లి వచ్చి ఒక వ్యక్తి దగ్గర 40 కేజీల గంజాయిని కొనుగోలు చేసి కారులో తిరిగి ఢిల్లీకి బయలుదేరి వెళుతుండగా ఎండపల్లి వద్ద కారు తో పాటు ముగ్గురు వ్యక్తులు అదుపులోకి తీసుకున్నామన్నారు. వారిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

20న సమ్మె జయప్రదం చేయండి

విశాలాంధ్ర - చోడవరం: కేంద్ర ప్రభుత్వం దేశంలోని కార్మిక వర్గానికి తీవ్ర అన్యాయం చేసే విధంగా లేబర్ కోడ్స్ తెచ్చిందని, ఈ లేబర్ కోడ్స్ రద్దు, కనీస వేతనాలు , రైతులకు గిట్టుబాటు ధర డిమాండ్లతో జరగబోవు మే 20వ తేదీ సమ్మెలో కార్మికులు రైతులు, వ్యవసాయ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి గూనూరు వరలక్ష్మి, జిల్లా కోశాధికారి వి.వి శ్రీనివాసరావు లు పిలుపునిచ్చారు.

మంగళవారం చోడవరం సీఐటీయూ మండల సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. కార్మికులకు నష్టదాయకమైన లేబర్ కోడ్స్ వల్ల సమ్మె చేసే హక్కు , సంఘం పెట్టుకునే హక్కు, పనిగంటలు పెంచడం, పారిశ్రామిక వివాదాలు, చట్టానికి తూట్లు పొడవటం వంటి అనేక దుర్మార్గమైన విధానాలు ఈ లేబర్ కోడ్స్ లో పొందుపరిచారని, వీటిని ఎట్టి పరిస్థితుల్లో ఆమోదించకుండా తిప్పుకొట్టాలని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ డిమాండ్ల తోనే మే 20 న దేశవ్యాప్త సమ్మె జరుగుతుందని దీనిలో కార్మికులు, రైతులు, కూలీలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.వి నాయుడు, ఆశ వర్కర్స్ యూనియన్ నాయకులు కె. వరలక్ష్మి, బి. రామలక్ష్మి, అంగన్వాడీ యూనియన్ నాయకులు కొండమ్మ, రత్నం, నాగిరెడ్డి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పదిలో మెరిసిన విద్యార్థులకు
హోంమంత్రి ఘన సన్మానం

విశాలాంధ్ర - నక్కపల్లి: హోంమంత్రి వంగలపూడి అనిత నేతృత్వంలో విద్యాకుసుమాలకు ప్రశంసల పట్టాభిషేకం జరిగింది. 'పది' ఫలితాల్లో మెరిసిన విద్యార్థులను ఆమె ఘనంగా సన్మానించింది. పాయకరావుపేట నియోజకవర్గ వ్యాప్తంగా సత్తా చాటిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ఉత్తమ ప్రతిభను గుర్తించి సత్కరించింది. నక్కపల్లిలోని హోంమంత్రి క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన 'విద్యాకుసుమాల అభినందన' కార్యక్రమం సోమవారం అట్టహాసంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన హోం మంత్రి వంగలపూడి అనిత, 101 మంది మెరుగైన ప్రతిభ చూపిన పదోతరగతి విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.5,000 చొప్పున నగదు బహుమతులు, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో 50 ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి అనిత మాట్లాడుతూ, "గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు మట్టిలో మాణిక్యాలని. ప్రభుత్వ పాఠశాలలే నిజమైన శిక్షణ మందిరాలని.. ఉపాధ్యాయులు కనిపించే దేవుళ్లు" అని పేర్కొన్నారు. తాను కూడా ఉపాధ్యాయురాలిగా తన జీవితం ప్రారంభమైన విధానాన్ని ప్రస్తావించి విద్యార్థుల్లో స్ఫూర్తి నింపారు. విద్యారంగం పట్ల తనకున్న అనుబంధాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు. అంతేగాక, విద్యాశాఖ మంత్రి లోకేష్ గారి నాయకత్వంలో విద్యావ్యవస్థలో జరుగుతున్న సంస్కరణలను హోంమంత్రి అనిత ప్రశంసించారు. విద్యార్థుల విజయంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని తెలిపారు. అనంతరం విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించి వారి ప్రశ్నలకు ఉత్సాహంగా సమాధానాలిచ్చారు. విద్యార్థులందరితో కలిసి కలిసి భోజనం చేసి ఆత్మీయంగా గడిపారు. ఈ కార్యక్రమం ఉపాధ్యాయులు, విద్యార్థులలో కొత్త ఉత్సాహాన్ని నింపిందని తెలిపారు. విద్యాకుసుమాలను గుర్తించి వారి కృషి, వారి వెనక తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల కఠోర శ్రమను గౌరవించి ప్రోత్సహించడమే ఈ కార్యక్రమ ఉద్దేశమని హోంమంత్రి అనిత వెల్లడించారు. ప్రతి సంవత్సరం ఈ అభినందన కార్యక్రమాన్ని నిర్వహించేందుకు సంకల్పించినట్టు ఈ సందర్భంగా ఆమె స్పష్టం చేశారు.

పాడి రైతుల పిల్లలకు సువర్ణావకాశం

విశాలాంధ్ర - చోడవరం: విశాఖ డైయిరీ సభ్యులైన పాడి రైతుల పిల్లలకు ఇంటర్మీడియట్ చదువు నిమిత్తం గొప్ప సువర్ణ అవకాశమును కల్పిస్తున్నట్లు డైరీ మేనేజ్మెంట్ ట్రస్ట్ మంగళవారం ఓ ప్రకటనలో తెలియజేసింది. ఇంటర్మీడియట్ ఎంపీసీ, బైపిసి, ఎన్ఆర్ఐ కాలేజీల్లో చదువుదామని ఆసక్తిగల డైరీ సభ్యులు పిల్లలకు ఈనెల 11న విశాఖ డైరీ స్కూల్ నందు టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. టాలెంట్ టెస్ట్ లో ఉత్తీర్ణులైన పాడి రైతుల పిల్లలకు మొదటి సంవత్సరం పదివేల రూపాయలు ఫీజు రాయితీ కల్పిస్తున్నట్లు తెలిపారు సుఖీభవ కార్డ్ కలిగి, ఐదు సంవత్సరముల నుండి డైరీకి పాలు పోస్తున్న సభ్య రైతులు వీటికి అర్హులని తెలిపారు. మరిన్ని వివరాలకు ఫోన్ నెంబర్ : 824768 9856, 89771 22442, 944040 6418 లలో సంప్రదించ వచ్చునని తెలిపారు.

అమ్మవార్లను దర్శించుకున్న సినీనటి ఇంద్రజ

విశాలాంధ్ర - అనకాపల్లి: సినిమా షూటింగ్లో పాల్గొనేందుకు అనకాపల్లికి వచ్చిన ప్రముఖ సినీనటి ఇంద్రజ మంగళవారం శతకం పట్టులో ఉన్న శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయం, శ్రీ గౌరీ పరమేశ్వరి ఆలయం, శ్రీ మరిడి మాంబ ఆలయంలో అమ్మవార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆమెను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. శ్రీ కనకదుర్గ ఆలయ వ్యవస్థాపకులు పివి రమణ, ఆలయ శాశ్వత ఛైర్మన్, నిర్వాకులు కాండ్రేగుల నాయుడు దంపతులు, ఆలయ అధ్యక్షులు భీమరశెట్టి వర నూకరాజు,శ్రీ గౌరీ పరమేశ్వరుల ఆలయ ఉత్సవ కమిటీ ఛైర్మన్ కొణతాల సంతోష్ అప్పారావు నాయుడు, పొలిమేర శ్రీను, గడేపల్లి మురళి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

శ్రీ దుర్గాలమ్మ పండగలో గండి రవికుమార్

విశాలాంధ్ర - సబ్బవరం: మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ ప్రజలు ఆరాధ్య దైవమైన శ్రీ శ్రీ శ్రీ దుర్గాలమ్మ అమ్మవారి వారి ఆలయం పండుగ మహోత్సవం లో పెందుర్తి నియోజకవర్గం వైస్సార్సీపీ నాయకులు గండి రవికుమార్ పాల్గొని అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి అమ్మవారిని దర్శించుకొని తీర్థ ప్రసాదములు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన ఆ అమ్మవారి ఆశీస్సులు ఈ ప్రాంత ప్రజలు అందరి పైన ఎల్లప్పుడూ ఉండాలని , అందరూ సుభిక్షంతో మెలగాలని ఆ అమ్మవారిని కోరుకున్నారు ఆయనతో పాటు సబ్బవరం మేజర్ పంచాయతీ సర్పంచ్ ధెద్దం ప్రసాద్ , వైస్సార్సీపీ మండల పార్టీ అధ్యక్షులు కర్రి బాబు , మాజీ సర్పంచ్ ధనిమిరెడ్డి శ్రీనివాసరావు , వార్డ్ మెంబెర్ చిత్రాడ శ్రీను , వైస్సార్సీపీ నాయకులు గొర్లి రమణ , గురి శ్రీనివాస్ , కరక రాము మరియు గండి రవికుమార్ యువసైన్యం ఉన్నారు.

ఘనంగా శ్రీ దుర్గాలమ్మ తల్లి పండగ అనుపు

విశాలాంధ్ర -సబ్బవరం: మండల కేంద్రంలోని సబ్బవరం మేజర్ పంచాయతీ గ్రామ ప్రజలు ఆరాధ్యదైయమైన శ్రీ దుర్గాలమ్మ తల్లి అమ్మవారి పండగ అణుపు మహోత్సవం సందర్భంగా మంగళవారం ఉదయం 5 గంటల నుండి అమ్మవారికి ధూప, దీప,నైవేద్యంతో,ప్రత్యేక పూజలు, అభిషేకాలు, ఆలయ ఉత్సవ కమిటీ నిర్వాహకులు, గ్రామ పెద్దలు ఆధ్వర్యంలో నిర్వహించారు. భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని వసుపు, కుంకుమ, చీరలు తమ తమ మొక్కులు చెల్లించుకోవడానికి బారులు తీశారు. పెందుర్తి నియోజకవర్గం టీడీపీ పార్టీ ఇంచార్జ్ గండి బాబ్జి, మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు సోదరుడు పంచకర్ల వెంకటేశ్వరరావు, జిల్లా టిడిపి తెలుగు యువత అధ్యక్షుడు పి.బి.వి.వి.ఎస్.ఎన్ రాజు, పెందుర్తి నియోజకవర్గం వైసీపీ నాయకులు గండి రవికుమార్, గ్రామ సర్పంచ్ దెడం ప్రసాదరావు ముఖ్య అతిథిగా పాల్గొని అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ నిర్వాహకులు వారిని ఘనంగా సత్కరించారు. సాయంత్రం నిర్వహించిన అమ్మవారు వేషాలు, కోలాటాలు,పలు సంస్కృత కార్యక్రమములు చూపరులను బాగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో యువ నాయకులు గండి వంశి దీప్, కూటమి నాయకులు బలిరెడ్డి అప్పారావు,ఇందల వెంకటరమణ, కర్రీ కనకరాజు, కోరాడ శ్రీనివాసరావు, పల్లా తాతారావు, బర్ల రమణ,మామిడి శంకర్రావు,బంతికోళ్ల పద్మ, టి శేఖర్, మంగరాజు, వైసీపీ నేతలు కర్రి బాబు , చిత్రాడ శ్రీను , గొర్లి రమణ , గురి శ్రీనివాస్ , కరక రాము మరియు గండి రవికుమార్ యువసైన్యం పాల్గొన్నారు.